ఓటే ప్రజల ఆయుధం

"ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకం. దేశ ప్రగతి.. పురోగతికి నిజమైన సాధనం. సమర్థవంతమైన పాలనను ఎంచుకునే ఆయుధం.. అందుకే అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి. ముఖ్యంగా యువత మరింత ఉత్సాహంగా ముందుకు రావాలి. ఉజ్వల భవితకు బలమైన పునాదులు వేసుకోవాలి" అంటూ పలువురు అధికారులు, అధ్యాపకులు పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఓటును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- విద్యార్థులు, అధికారుల ర్యాలీలు.. మానవహారాలు


చంద్రగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ రామ్మోహన్ తదితరులు

చంద్రగిరి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ఆయుధమని ఆర్‌డీఓ రామ్మోహన్ తెలిపారు. శనివారం చంద్రగిరిలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటు అనే రెండక్షరాలకు ప్రపంచ గతిని మార్చే శక్తి ఉందన్నారు. యువ ఓటర్లను చైతన్యవంతం చేయడంలో భాగంగా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లకు సన్మానం చేశారు. ఎంపీడీఓ శేఖర్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ సుమన్, డీటీలు దివాకర్, మహేశ్వరి, వీఆర్‌ఓలు విష్ణు, సిద్ధయ్య, పురుషోత్తం, అశోక్, విజయ్, శివ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ ఇందిరమ్మ, డీటీ అన్వర్‌బాషా, ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు, ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

తిరుపతి గాంధీ రోడ్ : స్థానిక కరకంబాడి రోడ్డులోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ కేఆర్ అనురాధ గోపాల్, ఏఓ చంద్రశేఖర్, పీఆర్ఓ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

పాకాల : ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంతోషసాయి కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డీటీ కల్యాణ్, జూనియర్ అసిస్టెంట్ వినోద్, వీఆర్‌ఓలు చక్రపాణి, కృష్ణపిళ్లై, నిరోష, ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా పాల్గొన్నారు.

తిరుపతి సిటీ : ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ పి.శివకుమార్, బి.సులోచన రాణి, అధ్యాపకులు డాక్టర్ జగదీష్ కుమార్, డాక్టర్ రాజేష్, సృజన, ప్రియా సింగ్, డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.


ర్యాలీలో ఏస్‌జీఎస్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు


పాకాలలో..


స్ప్రింగ్ డేల్ స్కూల్‌లో..

క్లుప్తంగా

గంగమ్మకు మండల పూజ


విశేషాలంకరణలో అమ్మవారు

భాకరాపేట : చినిగేపల్లెలోని కట్టమీద గంగమ్మ తల్లికి శనివారం ఘనంగా మండల పూజ నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, నాగలక్ష్మి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ సింహాల విమలమోహన, మనోహర్, శంకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శశిప్రియ, మాధవి పాల్గొన్నారు.

28 నుంచి అధ్యయనోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దివ్య ప్రబంధ పారాయణం చేపట్టనున్నారు. అందులో భాగంగా నిత్యం రాత్రి 7.15 నుంచి 8.15 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు, సేనాధిపతి, ఆళ్వార్లను వేంచేపు చేయనున్నారు. వారి సమక్షంలో దివ్య ప్రబంధం పారాయణం నిర్వహించనున్నారు. అలాగే ఫిబ్రవరి 7న చిన్న శాత్తుమొర, 13న ప్రణయ కలహోత్సవం, 17న పెద్ద శాత్తుమొర జరిపించనున్నారు.

4న రథసప్తమి వేడుకలు

శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 4వ తేదీన రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవదేవేరులు ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు.

మత్తుతో జీవితం చిత్తు


మాట్లాడుతున్న ఎస్ఐ దీపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ దీపిక తెలిపారు. శనివారం కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు "సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఆఫ్ క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ డ్రగ్ అబ్యూస్ ట్రాఫిక్ రూల్స్" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు సావాసాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, జనరల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ పాల్గొన్నారు.

పాఠశాలల పురోగతిపై సమీక్ష

రామచంద్రాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పురోగతిపై ఎంఈఓలు మార్కొండయ్యనాయుడు, జయవేలు సమీక్షించారు. ఎఫ్ఏ-1,2, ఎస్ఏ-1,2 పరీక్షలలో విద్యార్థుల మార్కులతోపాటు పాఠశాలల్లోని మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల అభివృద్ధి, హేబిటేషన్ , సముదాయాల ప్రణాళికలను తయారు చేయడంపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలల వారీగా స్టార్ రేటింగ్‌ను పరిశీలించారు. మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు.

డాక్టరేట్ ప్రదానం



మురళి, శ్రీకామేశ్వర్‌రావు

తిరుపతి సిటీ : ఈఈఈ పరిశోధక విద్యార్థి చెరుకూరి మురళికి కాకినాడ జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈఈఈ ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య పర్యవేక్షణలో " హార్మోనిక్ రిడక్షన్ ఇన్ విండ్ ఎనర్జీ బేస్డ్ ఫైవ్ ఫేస్ స్క్వారెల్ కేజ్ ఇండక్షన్ జనరేటర్ ఇంటిగ్రేటెడ్ టూ గ్రిడ్ యూజింగ్ మోడ్రన్ కంట్రోల్ టెక్నిక్ " అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. అలాగే ఎస్వీయూ గణితశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఎం.శ్రీకామేశ్వర్‌రావుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ సి.జయసుబ్బారెడ్డి పర్యవేక్షణలో ' (సిగ్మా, టౌ) రివర్స్ డెరివేషన్స్ ఇన్ రింగ్స్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం సినీ నటుడు నితిన్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



సినీ నటుడు నితిన్, ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి

బంగారం చోరీ

తిరుపతి క్రైమ్: చెన్నారెడ్డి కాలనీకి చెందిన అరుణ అనే మహిళ ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని 30 గ్రాముల బంగారం దోచుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది

గోకులంలో గణతంత్ర వేడుకలు

తిరుమల : తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. అదనపు ఈఓ వెంకయ్యచౌదరి జెండా వందనం సమర్పించనున్నారు.

ఉత్తమ సిబ్బందికి నేడు పురస్కారం

తిరుపతి సిటీ : టీటీడీ డిగ్రీ కళాశాలలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందించనున్నారు. ఈ మేరకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎకనామిక్స్ అధ్యాపకులు కె.సుబ్రమణ్యం నాయుడు, వి.చంద్రబాబు, కంప్యూటర్ ఆపరేటర్ ఎన్.సుధారాణి, హాస్టల్ ఉద్యోగి టీవీకే రామారావు, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ, బయోటెక్నాలజీ హెచ్ఓడీ బి.సులోచనరాణి, జూనియర్ అసిస్టెంట్ శరవణకుమార్ ఎంపికయ్యారు. అలాగే పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకులు హేమలత, జూనియర్ అసిస్టెంట్ కన్నయ్య, హాస్టల్ వర్కర్ రాజమ్మ అవార్డులు అందుకోనున్నారు.

నాణ్యతే లక్ష్యంగా 'హోమ్ డెకార్స్'


లాటెక్స్ మ్యాటర్స్‌ను తయారు చేస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని తిరుపతి హోమ్ డెకార్స్‌లో నాణ్యమైన లాటెక్స్ మ్యాటర్స్ తయారు చేస్తున్నట్లు హోమ్ డెకార్స్ యజమాని కిషోర్ తెలిపారు. ఈనాటిక్స్‌లు చెట్టు రబ్బర్ నుంచి నాణ్యతమైన క్వాలిటీతో ఈ లాటెక్స్ మ్యాటర్స్ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. బ్యాక్ పెయిన్ ఉన్న వారికి ఇవి చాలా కంఫర్ట్‌గా, ఏళ్ల తరబడి మన్నికగా ఉంటాయని వివరించారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

● ఆలాపన



తిరుపతి స్విమ్స్‌లో శనివారం ఘనంగా వందేమాతరం గీతాలాపన చేపట్టారు. అపురూప గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్విమ్స్ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు సామూహికంగా వందేమాతరం ఆలపించి ఆకట్టుకున్నారు. - తిరుపతి తుడా

● ఆదరణ



పద్మావతి కళాశాల పూర్వ విద్యార్థినుల సంఘం వారు శనివారం పాస్ స్వచ్ఛంద సేవా సంస్థలోని అనాథల కోసం నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ, పూర్వ విద్యార్థినుల సంఘం అధ్యక్షులువసుధ, కార్యదర్శి విద్యుల్లత, ట్రెజరర్ ఉమాదేవి, వైస్ ప్రిన్సిపల్ భద్రమణి, హేమలత, ఉమారాణి, భువనేశ్వరీ దేవి, సునీత, శిరీష, పద్మజ, విజయ పాల్గొన్నారు. -తిరుపతి సిటీ

స్థలం పేరుతో మోసం

తిరుపతి క్రైమ్: స్థలం విక్రయిస్తామని చెప్పి మోసం చేసిన ఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. వివరాలు.. శిరీష మాధురి అనే మహిళ ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న సీమాకుమారి అనే మహిళతో స్థలం కొనాలని శిరీష చెప్పారు. దీంతో ఆమె తమ స్థలమే ఉందని తూకివారం వద్ద ఓ భూమి చూపించింది. నకిలీ పత్రం అందించి రూ.11లక్షలు తీసుకుంది. తీరా ఆ స్థలం వేరే వారిది అని తెలియడంతో శిరీష వెంటనే పోలీసులను ఆశ్రయించింది. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా దేవదేవేరులకు కనుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజకుమార్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

తిరుపతి క్రైమ్ : బైరాగిపట్టెడ వద్ద శుక్రవారం రాత్రి మద్యం తాగిన మత్తులో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. వివరాలు.. అవిలాలకు చెందిన రూపేష్, జ్యోతిష్ తో పాటు మరో ఇద్దరు కలిసి మద్యం తాగుతుండగా తేజ, చరణ్ అనే యువకులు గొడవకు దిగారు. ఈ ఘర్షణలో రూపేష్ గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంట్లో చోరీ


దుండగులు పగులగొట్టి బీరువా

చంద్రగిరి: గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన ఘటన స్థానిక బ్రాహ్మణవీధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బ్రాహ్మణ వీధికి చెందిన వెంకట అప్పయ్యశాస్త్రి కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 17న తీర్థ యాత్రలకు వెళ్లారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉంచిన 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదును దోచుకెళ్లారు. ఉదయం ఇంటి వద్దకు వచ్చిన బంధువులు చోరీని గుర్తించి, ఇంటి యజమానికి సమాచారం అందించారు. బాధితులు పరిశీలించగా బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. క్లూజ్ టీం అధికారులు వేలి ముద్రల సేకరణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి భద్రతపై అవగాహన

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో శనివారం పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై రవాణా శాఖ అధికారులు శనివారం శిక్షణ నిచ్చారు. జిల్లారవాణా శాఖాధికారి మురళీమోహన్ మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టంపై డ్రైవర్లకు అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భద్రతే ప్రధాన ధ్యేయంగా వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంవీఐ సుబ్రహ్మణ్యం, మోహన్ కుమార్, వెంటరమణనాయక్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు సత్కారం


శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత శ్రీధర్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'టవర్స్' నిర్మాణ పనుల పరిశీలన

తిరుపతి తుడా : తుడా టవర్స్ నిర్మాణ పనులను శనివారం కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో టవర్స్ పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ తుడా టవర్స్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి లోపు మోడల్ ప్లాన్, ఎగ్జిబిషన్ స్టాల్ పనులు పూర్తి చేస్తే వేలం నిర్వహించేందుకు వీలుంటుందని తెలిపారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో తుడా సెక్రటరీ వెంకట నారాయణ, కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, నిర్మాణ సంస్థ ప్రతినిధి సుశీల్ పాల్గొన్నారు.

'చలో తిరుపతి కార్పొరేషన్' రేపు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : వీధి వ్యాపారుల చట్టం అమలు చేయాలని కోరుతూ సోమవారం చలో తిరుపతి కార్పొరేషన్ చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్ వెల్లడించారు. ఈమేరకు శనివారం శ్రీనివాసం కల్యాణ మండపాల వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, లైసెన్స్‌లు, మౌలిక వసతులు కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించడంతో ప్రత్యేక చట్టం జారీ చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆ చట్టాన్ని తుంగలోతొక్కుతోందని మండిపడ్డారు. నేతలు ఎన్‌డీ రవి, బాలాజీ, శ్రీనివాసులు, విజయ్, శేఖర్, భాష, శంకర, రమణమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

'ఎస్వీసీసీ'లో జాబ్‌మేళా రేపు

తిరుపతి సిటీ : స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరగనుందని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఏదేని డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌తో పాటు మరింత సమాచారం కోరకు 8074919939, 9177508279 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రుయా అభివృద్ధి కమిటీలో ఇద్దరు నియామకం

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి అభి వృద్ధి కమిటీ సభ్యులుగా ఇద్దరికి అవకాశం కల్పించారు. శనివారం ఈ మేరకు కలెక్టర్, కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆరణి సిఫార్సు ప్రకారం కె.సందీప్, షేక్ ఖాజా మొహిదీన్‌ను నియమించారు. ఈ క్రమంలో షేక్ ఖాజా రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అయితే ఈ నియామకాలపై కూటమి పార్టీలకు చెందిన పలువురు నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

హాస్టల్ భవన నిర్మాణానికి విరాళం


వర్సిటీ అధికారులతో కలసి భూమి పూజలో దాత గోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి, హైదరాబాద్ కు చెందిన జీఆర్ పవర్ స్విచ్ గేర్ సంస్థ అధినేత సి.గోపాల్ రెడ్డి రూ.40 లక్షల విరాళాన్ని వర్సిటీ అధికారులకు శనివారం అందజేశారు. వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థినుల హాస్టల్ భవన నిర్మాణం కోసం విరాళం అందజేసినట్లు దాత వెల్లడించారు. అనంతరం భూమి పూజలో వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారావు, కేఎం భాను, హాస్టల్ వార్డెన్ గౌరీ శంకర్ రెడ్డి, ఇంజినీర్ తాండవ కృష్ణ పాల్గొన్నారు.

వితరణ



రైల్వేస్టేషన్‌కు వచ్చే దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం స్పర్శ ఆస్పత్రి అధినేత డాక్టర్ హరిబాబు శనివారం మూడు వీల్‌చైర్స్ వితరణగా అందించారు. రైల్వే కూలీ సంఘం గౌరవాధ్యక్షుడు కుప్పాల గిరిధర్‌కుమార్, అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, ఆంజనేయులు, కుమార్, గోవిందరాజులు పాల్గొన్నారు. - తిరుపతి కల్చరల్

విహారం



చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులను శనివారం విహారయాత్రకు తీసుకెళ్లారు. ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో చారిత్రాత్మక చంద్రగిరి కోట సందర్శన చేపట్టారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంఈఓ లలిత కుమారి పాల్గొన్నారు. - చంద్రగిరి